# దక్షిణపళ్ళెం

గోపాలం నాన్నని, 'గోపాలం నాన్న' అనటం! గోపాలం నాన్నకి ఇష్టం వుండదు—"వాడు నా కొడుకు కాద, దొంగగాడిద కొడుకు" అంటాడు.

గోపాలానికీ ఇష్టం వుండదు—"వాడు మా నాన్నకాడు— గీన్నా కాడు. యముడు—రాక్షసుడు, దరిద్రుడు" అంటాడు.

అసలు గోపాలం పుట్టినప్పుడు వాళ్ళ నాన్నకి పదెకరాల పొలం వుండేది. గోపాలాని కిప్పుడు ఇరవైయేళ్ళు. వాళ్ళ నాన్న కిప్పుడు వొందెకరాల పొలం వుంది.

గోపాలం ఆరోక్లాసుతో చదువు మానేశాడు. ఏడోక్లాసు పుస్తకాలు కొనటానికి వాళ్ళ నాన్నకి ప్రాణం వొప్పలేదు—"చదువెవడికూడెట్టింది? నాగలెత్తుకొని చేలోకిరా" అన్నాడు కొడుకుని.

అప్పట్లో గోపాలానికి చదువు మానెయ్యటం బ్రహ్మానందంగా వుంది. ఇప్పుడేడుస్తాడు చదువుకొంటే ఈ కొంప వొదిలి ఎటన్నా పోయే వాణ్నికదా అని. ఆ కొంపలో వాళ్ళ నాన్న దరిద్రుడొక్కడే. అయితే, గోపాలం చాలాకాలం కిందట ఎటో పారిపోయేవాడే. అతని రోగిష్టి తల్లీ, అమాయకపు చెల్లెలూ అతను ఎటూ పారిపోలేని మమతాను బంధాలతో కట్టిపడేశారు. గోపాలం చాలా చిన్నప్పుడెప్పుడో చుట్టాల డబ్బులతో మాయాబజారు సినిమా చూశాడు. అందులో ఘటోత్కచుడు వేషం వేసినాయన మింగబోయే మిఠాయివుండల రాసులన్నీ చూస్తే గోపాలానికి చెప్పలేని వుక్రోషం వచ్చింది. జీవితంలో వొక్కసారన్నా అలాంటి మిఠాయివుండలు తినాలని మహా కోరిక ఏర్పడింది. ఇంటికొచ్చి వాళ్ళమ్మకి చెప్తే—"అయ్యో! మనకి అంత అదృష్టంకూడానా నాయనా!" అని కళ్ళ నీళ్ళు పెట్టుకొంది.

గోపాలం కరిగి — "పోనీ వొద్దులేమ్మా! మిఠాయి తింటేనే గొప్పా ఏంటి? అయినా అవన్నీ బొమ్మ మిఠాయి వుండలేకదా!" అని నవ్వి వాళ్ళమ్మ దిగులు పోగొట్టాలనుకున్నాడు.

తర్వాత ఏడెనిమిదేళ్ళకి గోపాలానికి తనివిదీరా మిఠాయి తినే భాగ్యం దొరికినట్టే దొరికి జారిపోయింది. గోపాలం చెల్లెలు సీత పెళ్ళిలో నాలుగుమళ్ళ మిఠాయీ, జిలేబీలూ అర్ధరాత్రి రహస్యంగా చేయించి తెల్లారేప్పటికి ఆ గంపలన్నీ మిద్దెగదిలోదాచి – ఆ గది తాళంచెవి ఇనప్పెట్టెలోపెట్టి–దాని తాళంచెవి కావిడిపెట్టిలోపెట్టి–దాని తాళం బొడ్లో పెట్టుకుని తిరిగాడు, వాళ్ళనాన్న.

సీత పెళ్ళి అడుగడుగునా దెబ్బలాటల్తో, దెప్పుకోడాలతో–అలక లతో, నిష్ఠూరాలతో చాలా ఆనందంగా జరిగిపోయింది. గోపాలం సీతతోపాటు దాని అత్తారింటికెళ్ళి మూడురోజులున్నాడు. ఆ మూడు రోజులూ గోపాలం అన్నంజోలికి పోలేదు. తొక్కుడు లడ్డూలు పంచ దారతో చుట్టిన పూతరేకులు–బెల్లం, సున్నుండలు, కొబ్బరికోరు, కజ్జి కాయలు–శేరున్నర మజ్జిగపట్టే వెండిగిన్నెలనిండా పరమాన్నం, పులిహోరలతో కాలం గడిపాడు. సీతని మళ్ళీ పుట్టింటికి తీసికెళ్ళడానికి పెళ్ళిపెద్దలొస్తే "దాన్ని తీసికెళ్ళండి. నేను కొన్నాళ్ళుండి వొస్తాలే" అన్నాడు గోపాలం. వాళ్ళంతా కేకలేసి అతన్నికూడా బలవంతంగా లాక్కెళ్ళారు.

తర్వాత సీత నాన్నకీ–అత్తారికీ పోట్లాట లెక్కువయ్యాయి. సీత నాన్న–కూతురికి ఇస్తానన్న కట్నమూ ఇవ్వలేదు. లాంఛనాలూ ఇవ్వలేదు. ఇస్తాడనే ఆశన్నా లేకుండా 'ఛస్తే ఇవ్వను పో'మ్మన్నాడు. అప్పట్నించి సీతని అత్తారింటికి తీసికెళ్ళనేలేదు.

సీతా వాళ్ళమ్మ ధైర్యం కూడగట్టుకుని మొగుడితో చెప్పబోతే– "ఏడిశావులే ఫో" అన్నాడాయన.

కొడుకు చెప్పబోతే–"ఏడిశావులేపో" అన్నాడు. ఆయన ఇంట్లో వాళ్ళని– బయటవాళ్ళని–చుట్టాల్ని–పాలేళ్ళని అందరిని ఆ వొక్కమాటే అనేసి బిగదీసు కూర్చుంటాడు. ఆయన్ని జయించటం వియ్యాలవారి తరంకూడా కాలేదు. ఒకసారి ఆయన అల్లుడ్నిగూడా "ఏడిశావులే ఫో" అన్నాడు. అప్పట్నించి అల్లుడు గుమ్మం ఎక్కలేదు.

సీత యింక అత్తారింటికి వెళ్ళే రోజు రాదేమోనని వాళ్ళమ్మకి వొకటే బెంగ, ఎప్పుడూ బొటబొట కన్నీళ్ళు.

గోపాలానికి రెండు గొప్ప బాధ్యతలున్నాయి. వొకటి—తల్లికి మంచి వైద్యం చేయించాలి. ఆవిడ కెప్పుడూ ఏదో జబ్బు....నీరసం.... రక్తంలేదు. విశ్రాంతి....మంచి ఆహారం....టానిక్కులు....పుష్టిగా నేతి మజ్జిగలు-ఇవన్నీ ఆ భర్త బ్రతికివుండగా జరిగే ఆశ లేదు. తండ్రి ఎప్పుడు పోతాడో చెప్పమంటే ఏ జ్యోతిష్కుడూ చెప్పలేకపోయాడు; పాతచొక్కాలు పంచలు పట్టుకుపోయారుగానీ, తండ్రిని చంపి తల్లిని బ్రతికించాల్సిన బాధ్యత తనదే ననుకుంటాడు గోపాలం.

రొండు—చెల్లెల్ని అత్తారింటికి పంపాలి. దానికి భర్తంటే చాలా ప్రేమ. అతనికికూడా అంతే. తను తండ్రి నీడలో ఎలా పడివున్నాడో అతనూ తల్లిమాట కింద అలాగే మగ్గుతున్నాడు. పెద్ద రాక్షసులిద్దరూ ఈ జన్మకి సఖ్యపడరు. దాని జీవితం బూడిదలలో పోసిన పన్నీ రవుతుంది. అలా జరగటానికి వీల్లేదు. చేతిలో పదివేల రూపాయలు పట్టుకుని అందరి కష్టాలూ తీర్చెయ్యాలి. వెధవది ఆ పదివేలతోనే చిక్కు.

*          *          *

చంద్రుడు ఆకాశం ఎక్కి వొస్తున్నాడు. చెరువుగట్టు నిర్మానుష్యంగా వుంది. నీళ్ళలో రాతిమెట్లు తేలుతున్నాయి.

గోపాలం వొక్కడూ కూర్చున్నాడు.

అతని మనసంతా దిగులుగావుంది. ఎప్పటికన్నా భారంగా వుంది. ఆ రోజు పెద్ద పండుగ. ఏ పండగా పండగలాగ గడవటం అతనికి తెలీదు రోజుకన్న విచారంగా గడుస్తుంది. చెల్లెలు కొత్తబట్టలు కట్టు కోదు. తల దువ్వుకోదు. కూతుర్నిచూచి వాళ్ళమ్మ ఏడుస్తూ వుంటుంది. తన తండ్రి దగ్గర ఏవేవో నగలు తాకట్టుపెట్టుకున్న పేదవాళ్ళు వాటికోసం వొచ్చిపోతూ వుంటారు. ఏ వడ్డీ డబ్బులో సరిపోలేదని ఆయన వాళ్ళ ముక్కుపుడకలో-చెవుల దుద్దులో ఇవ్వటానికి నిరాకరిస్తూ వుంటాడు. ఎంత జాలి కలిగేలాగ అడిగినా—"ఏడిశావు ఫో." అని వెళ్ళగొడుతూ వుంటాడు.

పాలేరు వెంకన్న కూతురు, ఆరేళ్ళబట్టి పండక్కి జడకుచ్చులు వేసుకుంటానని వొకటే ఏడుపు. వాళ్ళమ్మ దాన్ని లాక్కొచ్చి పెద్దాయన కాళ్ళమీద పారేసింది. ఆయన వొక్క తన్ను తన్ని బయటికి తరిమాడు. చిట్టి ఏడుస్తోంటే గోపాలం మనస్సు విలవిల్లాడింది.

ఎప్పట్లాగే పండగ గడిచిపోయిందిగానీ, గోపాలం పట్టుదల అప్పటికన్న ఎక్కువైంది. పిచ్చిపట్టినవాడిలాగ వొక్కడూ అర్ధరాత్రి వరకూ చెరువుగట్టునే కూర్చున్నాడు.

కళ్ళ ముందేదో తళతళా మెరిసింది, కత్తి! "కదలకు. ఉంగరం తీసియ్యి."

గోపాలం కదిలి తలతిప్పి చూశాడు. నల్లటి ముసుగు. "ఊఁ తియ్యి వుంగరం-" గోపాలానికి ఫక్కున నవ్వొచ్చింది. "ఉంగరమా? ఎవరిది?"

"నరుకుతా. చెర్లో కప్పెడతా. తియ్యి ముందు."

"చాల్లెండి దొంగగారూ, సిగ్గేస్తోంది నాకు. మా నాన్న ఉంగరం కూడా చేయించాడా?" రెండు చేతులూ ముసుగు మొహం మీదికి చాచి నాట్యం చేస్తోన్నట్టు తిప్పాడు గోపాలం.

"పోనీ నీ దగ్గిరేముంటే అది తియ్యి. డబ్బు తియ్యి."

"డబ్బా? నా దగ్గిరా? భలేవారేనే! మీ దేవూరూ? చలమయ్య కొడుకునండీ!....మీరే చెప్పుకోండి నా దగ్గిరేముంటాయో."

"అదంతా నాకు తెలీదు. ముందు డబ్బంతా అక్కడపెట్టు."

"ఏంటి దొంగగారూ! మీరు మరీనూ. డబ్బులుంటే ఇక్కడెందుకు కూర్చుంటానూ సినిమాకి పోకుండా."

"ఏదీ జేబు చూపించు."

"జేబా! మొన్న మా నాన్నమీద కోపంవచ్చి చింపేశా."

"ఏడవకపోయావూ? జరుగుకాస్త," అని దొంగగారు గోపాలం పక్కన చతికిలపడ్డాడు నమ్మి.

"మీరు ముసుగు తీసెయ్యండి. లేకపోతే నన్నుకూడా ముసుగులోకి

రానివ్వండి. ఇద్దరం మాట్లాడుకుందాం? చెప్పండి. ఏంటి సంగతులు ? ఆ కత్తి కొంచెం దూరంగా పెట్టారుకదా ?"

దొంగగారు ముసుగు తీసేసి ప్రత్యక్షం అయ్యారు .... "హోరీ నువ్వంట్రా !" అని గోపాలం ప్రాణమిత్రుణ్ణి కావలించుకున్నట్టు దొంగ గార్ని కావలించుకున్నాడు. ఆ దొంగ అప్పారావు. నిజంగా గోపాలానికి చిన్ననాటి మిత్రుడే. ఎంతో తెలివిగా చదివేవాడు. వాళ్ళనాన్న పుస్తకాలు కొనలేక బడిమానిపించాడు. అప్పారావునాన్న పొలందగ్గిర దొమ్మికేసులో చాలా అన్యాయంగా జెయిలుకెళ్ళాడు. వాళ్ళమ్మ కూలిచేసుకుంటూ బ్రతుకు తోంది. అప్పారావు మనసు ముసుగు వుద్యోగం మీదికి మళ్ళింది.

నువ్విలా చేస్తున్నావని చాలామంది అన్నారు గానీ నేను నమ్మ లేదు సుమీ. ఏమిట్రా ఈ వెధవపనీ?" అని విసుకున్నాడు గోపాలం.

"ఏం చెయ్యమంటావు మరి?" అని అప్పారావు బీడీవెలిగించాడు. అంతకన్న ఏం చెయ్యలేదు. గోపాలంకూడా సరదాపడి ఓ బీడీ అంటిం చాడు. దాంతో ఉక్కిరిబిక్కిరై చెర్లోకి విసిరి. "వోరేయ్! నాకోవుపాయం వొచ్చింది. నువ్వు నాకు దేవుళ్ళాగా కనబడుతున్నావు. చెప్పనా?" అన్నాడు.

అప్పారావు అదేం వినిపించుకోకుండా — "ఇంతకీ రేపు నువ్వు జేబునిండా డబ్బెట్టుకొస్తావా? లేదా?" తేల్చమన్నాడు ముందు.

"డబ్బేంట్రా? వేళ్ళనిండా వుంగరాలు కూడా పెట్టుకొస్తాను. నా క్కొంచెం సాయంచెయ్యాలి నువ్వు. మానాన్న కావిడిపెట్టి లేదూ ? నల్ల చెక్కది.... అది తియ్యగలవా ?"

"ఎందుకు తియ్యనూ తాళాలుంటే ?"

"ఏడిసినట్టుంది. తాళాలు మా నాన్న బొడ్లో వుంటాయి. ఆ వెధవ బొడ్డు ఆయన పొట్టచాటున వుంటుంది. అయితే నువ్వు తాళాలు లేకుండా పెట్టెలూ అవీ తియ్యలేవూ ? ఎందుకురా నీ దొంగజన్మ, నువ్వూను. నేను ఆ పనిలోకి దిగితేనా ?...."

"కత్తీ—సుత్తీ పట్టుకున్నానంటే ఆ పుచ్చుకావిడిపెట్టి ఓలెక్కా ? పద చూద్దాం." అని లేవబోయాడు అప్పారావు.

"ఉంద్రాబాబూ! ఇవ్వాళ్ళకాదు రేపు. రేపుగుళ్ళో హరికథవుందిగా? ఇంట్లో అందరూ పోతార్లే. మానాన్న ముండాకొడుకు కూడా ఏడాదికోసారి ఇల్లు కదుల్తాడు. సరిగ్గా ఇవ్వాళ నువ్వు నాకు దేవుళ్లాగ దొరికావు. చూపిస్తాను నా తడాఖా." అని వీరావేశంతో వుప్పొంగాడు గోపాలం.

ఇద్దరూ చాలాసేపు గుసగుసల్తో కార్యక్రమం నిర్ణయించుకుని.... కావలించుకుని విడిపోయారు.

* * *

మర్నాటి రాత్రి అంతా అనుకున్నట్టు చాలా సక్రమంగా జరిగింది.

రాక్షసి నోరులాగ తెరిచివున్న కావిడిపెట్టిముందు గోపాలం, అప్పారావూ కూర్చుని అందులో కాయితాల కట్టలన్నీ తీసి వీలైనంత చిన్నచిన్న ముక్కలుగా చింపిపోశారు. పోకరికన్నపోకరు వుత్సాహంతో పోటీపడి పని ముగించారు. గోపాలానికి వీశమెత్తయినా తటపటాయింపు కలగలేదు. ఊహతెలిసిన క్షణంనించీ లోపలి పొరల్లోంచి ఘనీభవిస్తూ వొచ్చిన కసిలో వొందోవొంతు కూడా తీరలేదు.

"వొరే అప్పారావ్! ఆ ఇనప్పెట్టి బద్దలుకొట్టరా! చిట్టి జడకుచ్చులున్నాయేమో చూద్దాం" అన్నాడు. వొక్కగంతులో అప్పారావు ఇనప్పెట్టి మీద పడ్డాడు. ఉద్యోగంలో కొత్తగా దిగాడేమో అతనింకా అపాఠం నేర్చుకోలేదు. దానిచుట్టూ ప్రదక్షిణాలు చేసి—"రేపు మా మేస్టార్ని తీసుకొస్తాలే—" అన్నాడు.

గోపాలం చాలా నిరుత్సాహపడి భోషాణం చూపించాడు. అది వొక్కతన్నుతో పగిలి వూరుకుంది. దాంట్లో చాలా ఆశ్చర్యంగా రాగి బిందెలో రూపాయలకట్టలు దొరికాయి. తప్పుతప్పులుగా లెక్కపెట్టినా, రెండువేలకి పైగా వున్నాయి. అప్పారావు కంగారుగా అవన్నీ పైపంచలో మూటకట్టి గోపాలం ముందుపెట్టాడు_"ఏం చెద్దాం?" అన్నాడు.

"మా అమ్మ.... మా సీత...." అని కలవరించాడు గోపాలం.

"పిచ్చోడివా? మంచోడివా? వాళ్ళకోసం ఈ డబ్బు వుపయోగిస్తే నీ రహస్యం బైటపడిపోదా? మీ బాబు.... నీ ఎముకలు...."

"ఏడిశాడు...."

"నా దగ్గిరకాదు. రేపు ఆయన మొహంమీద ఈమాటే ధైర్యంగా అనేశావంటే నీ సమస్యలన్నీ తీరిపోతాయి. ముసిలోడికి జడిసి ఈ చాటు మాటు ఎవ్వారం ఎందుకోయ్? రాజాలాగ ధిక్కరించి నిలబడాలిగానీ...."

"అంటే ఏం చెయ్యాలంటావూ?"

"నిర్భయంగా రంగంలోకి దిగు. గాది తాళాలు బద్దలుకొట్టి ధాన్యం అంతా అమ్మేసి ఇంట్లో అవసరాలన్నీ తీర్చు. ఇనప్పెట్టి తాళాలు వూడలాక్కొని ఎవరి వస్తువులు వాళ్ళకి అప్పగించు. ముసిలోడు అడ్డొస్తే వాచి లెంపకాయ కొట్టు. పోలీసులు పట్టుకుపోతే దర్జాగా జైల్లో కూర్చో అదయ్యా వీరత్వం....అంతే గానీ...."

గోపాలం శరీరం వుప్పొంగింది.

అబ్బ! నిజంగా అదంతా చేసేస్తే?

"గోపాలం! ఈ డబ్బు నా కిచ్చేయి. ఏదో చిన్న వ్యాపారం పెట్టుకుని నిలకడగా బ్రతుకుతాను. నీ అవసరాలు తీరేవికావు—నీ తెగింపుతో జరగాలి గానీ....మా నాన్నని ఎంత అన్యాయంగా జెయిల్లోకి తోయించారో నీకు తెలీదా? మన చిన్నప్పుడు మా అమ్మ! మీఅమ్మలాగే ఇంట్లో సుఖంగా వుండేదికాదా? నేను రెండేళ్ళు ఎంతో నమ్మకంగా పాలేరు పని చేస్తే ఆ రామయ్య ఎవరో చేసిన దొంగతనం నామీదపెట్టి గొడ్డును బాదినట్టు బాదాడు. నువ్వెరగవా?....నీకీ డబ్బువొక లెక్కంట్రా? నీపేరు చెప్పుకుని మా అమ్మా, నేనూ...."

"సరే! సరే! అలాగే తీసుకుపో! జాగ్రత్త! తెలివిగా మసులుకో ఏదన్నా ముంచుకొస్తే నీ మీదకి రానివ్వనే్లే."

ఇద్దరూ చింపిన కాయితాలన్నీ పెట్లోపోసి ఎక్కడివస్తువు లక్కడ సర్ది దొంగతనం వెంటనే బయటపడకుండా జాగ్రత్తపడ్డారు. అప్పారావు గోపాలాన్ని—"ఒరే! నువ్వెంత మంచోడివిరా!" అంటూ కావలించుకున్నాడు.

అబ్బ! ఎంత సుఖంగా వుందా కావలింత! ఇతర్లకి కొంచెంమంచి చేస్తే-వాళ్ళెంత ఎక్కువ సంతోషిస్తారో ఇన్నాళ్ళూ తెలియనే తెలియదు కదా? - అప్పారావు ఆపాడు దొంగతనాలు మానేసి — ఏదన్నా వ్యాపారం చేసుకుంటూ వాళ్ళమ్మతో సుఖంగా బ్రతికితే.

ఇద్దరూ గబగబా చీకట్లో చేతులు పట్టుకుని నడుస్తున్నారు. దూరంగా గుడి దగ్గిర హరిదాసు పాట – చిడతలూ వినిపిస్తున్నాయి.

అప్పారావు భక్తిగా — "ఇవ్వాళ లేచిన రోజు మంచిదిరా గోపాలం, దేవుడికి దణ్ణం పెట్టుకుని దక్షిణ వేసి పోదాం రా!" అన్నాడు.

గోపాలం వొప్పుకోక —"ఎందుకురా డబ్బుల్దండగ! ఆడబ్బులు పెట్టి బీడిలు కొనుక్కుని-రేపు చీకట్నే కోవటిగారయ్యని కాటా తీసుకు రమ్మని చెప్పేసివొద్దాం." అన్నాడు.

అప్పారావు సంబరంగా —"నిజంగా అంతపనీ చేస్తావేంట్రా?" అని నమ్మలేనట్లు చూశాడు.

"నిజంగా ఏంటి? చూడు ఏంచేస్తానో. ముసలాడు కిక్కురుమన్నాడంటే ఆడికి మూడిందన్నమాటే!....మా అమ్మని డాక్టర్ దగ్గిరికి తీసుకు పోవాల్రా! మా చెల్లెల్ని....అది సర్లే! రేపు ధాన్యం తూచే పనుంటది. తప్పకుండారా! ఏం?"

ఇద్దరూ గుడిపక్కనించి నడిచారు హరికథ అయిపోయింది. పూజారి దక్షిణపళ్ళెం తిప్పుతున్నాడు పందిట్లో.

గోపాలం నాన్న బొడ్లోంచి వొక్క పైసతీసి పిడికెట్లో గట్టిగా పట్టుక్కూచున్నాడు దక్షిణ పళ్ళెంకోసం.

(జనవరి 72 సంక్రాంతి స్వాతిలో మొదటిసారి.)

—o—